


# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 26-02-2026 సంపుటి : 07 సంచిక 280 పేజీలు : 8 వెల : రూ 3-00


## జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టును నిర్లక్ష్యంగా వదిలేశారు: సీఎం చంద్రబాబు

మార్కాపురం జిల్లా, ఫిబ్రవరి 25 : జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్టు పనులను నిర్లక్ష్యంగా వదిలేశారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలిగొండ పనులు పూర్తి అయ్యాయని జగన్ దొంగ మాటలు చెప్పారని ఎద్దేవా చేశారు. పనులు పూర్తికాకుండానే జగన్ రిబ్బన్ కటింగ్ చేశారని సెటైర్లు గుప్పించారు. ఇక్కడి రైతులు సాగునీరు లేకుండా అనేక ఇబ్బందులు పడ్డారని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టు వల్ల మార్కాపురం జిల్లాకు అనేక లాభాలు ఉన్నాయని వివరించారు. మార్కాపురం జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటించారు. వెలిగొండ ప్రాజెక్టు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు భారీ బహిరంగ సభలో ప్రసంగించారు.మార్కాపురం జిల్లా ప్రజలు తనకు ఘనస్వాగతం పలికారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ఏపీకి పూర్వ వైభవం వస్తుందని వ్యాఖ్యానించారు. పోలవరం జిల్లా ఇస్తానని చెప్పానని.. మాట నిలబెట్టుకున్నానని, అలాగే మార్కాపురం, మదనపల్లె జిల్లాలు ఇచ్చామని స్పష్టం చేశారు. రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే అందరూ సహకరించాలని కోరారు. ఏపీకి మేలు చేసేందుకే డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తాను కలిశామని ప్రస్తావించారు. అరకు నుంచి ప్రకాశం జిల్లా వరకు కూటమిదే హవానని చెప్పుకొచ్చారు. వచ్చే ఎన్నికల్లో ఒంగోలు, మార్కాపురం జిల్లాలో నూరుశాతం స్ట్రైక్‌రేట్ ఇవ్వాలని పిలుపునిచ్చారు. మార్కాపురం జిల్లా చేస్తానని చెప్పా.. మాట నిలబెట్టుకున్నానని తెలిపారు. మదనపల్లెకు కూడా న్యాయం చేస్తానని చెప్పా.. చేశానని ప్రస్తావించారు. మూడు వరాలు ఇచ్చేందుకు మార్కాపురం వచ్చానని



తెలిపారు. 1995లో మార్కాపురం ప్రజల కష్టాలు తాను చూశానని గుర్తుచేశారు.వెలిగొండ ప్రాజెక్టుతో రైతుల జీవితాలు బాగుపడతాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య వెలిగొండ పనులను పరుగులు పెట్టించామని చెప్పారు. మార్కాపురం వెనుకబడిన ప్రాంతమని.. 1996 మార్చి 5వ తేదీన ఈ ప్రాంతానికి వచ్చానని.. ఎక్కడ చూసినా ఫ్లోరైడ్ నీళ్లు కనిపించేవని గుర్తుచేశారు. తమకు శ్రీశైలం నీళ్లు కావాలని ఆనాడు ప్రజలు అడిగారన్నారు. కృష్ణా జలాలు తీసుకొస్తానని ఆరోజు మాట ఇచ్చానని.. వెలిగొండకు ఫౌండేషన్ తానే వేశానని.. పూర్తిచేసే అవకాశం తనకే వచ్చిందని పేర్కొన్నారు. ఒట్టి మాటలు చెప్పి మోసం చేయడం తనకు రాదని చెప్పుకొచ్చారు. 2014 వరకు వెలిగొండ పనులు నత్తనడకన సాగాయని విమర్శించారు. 2014 నుంచి 2019 మధ్య పనులు పరుగులు పెట్టించానని తెలిపారు. వెలిగొండతో 4 లక్షల ఎకరాలకు పైగా సాగులోకి వస్తాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## ప్రధాని మోదీకి అరుదైన గౌరవం..

### ఇజ్రాయెల్ పార్లమెంటు భవనం త్రివర్ణ మయం.!



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 25: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం ఉదయం ఇజ్రాయెల్‌కు బయల్దేరి వెళ్లారు. ఎయిర్‌పోర్ట్‌లో మోదీకి ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, ఆయన సతీమణి సారా స్వాగతం పలుకనున్నారు. ప్రధాని మోదీకి ఘన స్వాగతం పలికేందుకు యావత్ ఇజ్రాయెల్ సన్నద్ధమైంది. ప్రధాని మోదీ రాకను ప్రకటిస్తూ, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు.. మోదీని తన స్నేహితుడిగా అభివర్ణించారు.ఈ రెండు రోజుల్లో ప్రధాని మోదీ అనేక ముఖ్యమైన రక్షణ, వ్యూహాత్మక అంశాలపై చర్చిస్తారు. తన పర్యటనలో మొదటి రోజు(బుధవారం) మోదీ.. నెతన్యాహుతో ప్రైవేట్ విందులో పాల్గొంటారు. అనంతరం ఇజ్రాయెల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. ఇరుదేశాల స్పెషల్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్‌నకు మోదీ పర్యటన ముందడుగుగా నిలుస్తుందని పలువురు విశ్లేషకులు భావిస్తున్నారు.

## సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తాం: మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, ఫిబ్రవరి 25: ఏపీ శాసనమండలిలో 'ఆడబిడ్డ నిధి' పథకం అమలుపై వైసీపీ ఎమ్మెల్సీలు ప్రశ్నలు లేవనెత్తారు. 'ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారు.. ఇచ్చే ఉద్దేశం ఉందా' అని ఎమ్మెల్సీ సూర్యనారాయణరాజు ప్రశ్నించారు. జూన్ 2024 నుంచే పథకాన్ని అమలు చేస్తామని ఎన్నికల సమయంలో బాండ్లు ఇచ్చారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి గుర్తుచేశారు. సభ్యుల ప్రశ్నలకు ఎంఎస్ఎంఈ, సెర్ప్ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం ఇచ్చారు.ఆడబిడ్డ నిధి పథకం ప్రభుత్వ పరిశీలనలో ఉందని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రకాల పింఛన్ల మొత్తాన్ని పెంచిందని మంత్రి వివరించారు. వృద్ధాప్య పింఛన్లను 3 వేల నుంచి 4 వేల రూపాయలకు పెంచామని, ఏడాదికి రూ.33 వేల కోట్లు పింఛన్ల రూపంలో ఖర్చు చేస్తున్నామని చెప్పారు. సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు.మంత్రి సమాధానం ఇస్తున్న సమయంలో సభలో వైసీపీ ఎమ్మెల్సీలు ఆందోళన చేశారు. ఆడబిడ్డ నిధి పథకం ఎప్పటి నుంచి అమలు చేస్తారో సూటిగా చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో పలు స్కీమ్‌లలో జరిగిన లోపాలను మంత్రి శ్రీనివాస్ చెబుతున్నారని తెలిపారు. చివరకు.. అధికార, విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే ఆ ప్రశ్నకు సమాధానం వచ్చినట్లుగా ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు ప్రకటించారు.

## ప్రభుత్వ బడికి సరికొత్త రూపం తెచ్చారు..

### ఆ మాస్టారుపై మంత్రి లోకేశ్ ప్రశంసలు



అమరావతి, ఫిబ్రవరి 25 : కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం సగరపేటలోని మోడల్ ప్రైమరీ స్కూల్ ఎస్జీటీ పీవీవీ సత్యనారాయణ మాస్టరుపై ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రశంసలు కురిపించారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కోసం తన సొంత నిధులు, దాతల సహాయంతో స్కూల్‌ను కార్పొరేట్ పాఠశాల స్థాయికి తీసుకెళ్లి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా లోకేశ్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.సత్యనారాయణ మాస్టారు పాఠశాల అభివృద్ధి కోసం తన సొంతంగా దాదాపు రూ.10 లక్షలు ఖర్చు చేశారని మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. అదనంగా దాతల నుంచి రూ.1.80 లక్షల విరాళాలు సమీకరించి పాఠశాల రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. ఈ కృషితో ప్రభుత్వ పాఠశాల కూడా కార్పొరేట్ స్కూల్‌కు ఏమాత్రం తగ్గకుండా తీర్చిదిద్దారు. పాఠశాల క్లాస్‌రూమ్‌లలో టైల్స్ అమర్చడం, గ్రౌండ్ ఫ్లోరింగ్ చేయడం, కొత్త పెయింటింగ్ వేయడం, గోడలపై విద్యార్థులకు ఉపయోగపడేలా వాల్ రైటింగ్ చేయడం వంటి అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. అలాగే పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్‌ను రంగురంగులుగా తీర్చిదిద్ది ఆకర్షణీయంగా మార్చారు. ఈ మార్పులతో పాఠశాల కొత్త అందాలను సంతరించుకుంది. ఇంకా విద్యార్థులకు ఆధునిక విద్య అందించేందుకు నాలుగు కంప్యూటర్లతో డిజిటల్ క్లాస్‌రూమ్ ఏర్పాటు చేశారు. దీనివల్ల విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సులభంగా నేర్చుకునే అవకాశం కలిగింది. అదనంగా విద్యార్థుల్లో ప్రకృతిపై ఆసక్తి పెంచేందుకు కిచెన్ గార్డెన్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఇది పిల్లలకు ప్రాక్టికల్ నాలెడ్జ్ అందించడంలో కీలకంగా మారింది' అని మంత్రి నారా లోకేశ్ తెలిపారు.పాఠశాల హెడ్‌మాస్టర్, ఇతర ఉపాధ్యాయుల సహకారంతో ఈ అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తయ్యాయని మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. 'ఈ మార్పులతో ప్రభుత్వ పాఠశాలపై తల్లిదండ్రుల విశ్వాసం పెరిగింది. దీని ఫలితంగా వచ్చే విద్యా సంవత్సరంలో 64 మంది పిల్లలు కొత్తగా బడిలో చేరుస్తున్న మీ అంకితభావానికి హ్యాట్సాఫ్. ఇది ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ పాఠశాల అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కూడా అన్ని విధాలా సహాయం అందించారు. ఆయన సహకారం వల్ల పాఠశాల అభివృద్ధి వేగంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంత ముఖ్యమో ఈ ఘటన మరోసారి నిరూపించింది. సత్యనారాయణ మాస్టారు చూపిన అంకితభావం ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపరచడంలో ఇలాంటి మాస్టార్ల కృషి రాష్ట్ర విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తుంది' అని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

## జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు సుప్రీంకోర్టులో ఊరట

న్యూఢిల్లీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కు సుప్రీంకోర్టు లో ఉపశమనం లభించింది. సోరెన్‌పై మనీలాండరింగ్ చట్టం కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఆ) చేపట్టిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై అత్యున్నత న్యాయస్థానం స్టే ఇచ్చింది. కేసు కొట్టేయాల్సిందిగా కోరుతూ సోరెన్ వేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలని సీజేఐ సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్మాల్యా బాగ్చి, విపుల్ ఎం పంచోలితో కూడిన ధర్మాసనం ఈడీని అదేశించింది. పదేపదే తనకు ఈడీ సమన్లు జారీ చేస్తుండటాన్ని కూడా సోరెన్ తన పిటిషన్‌లో సవాలు చేశారు. ఈకేసులో విచారణ దాదాపు పూర్తి కావచ్చిందని, ఏడుసార్లు సమన్లు జారీ చేస్తే ఒక్కసారి కూడా సోరెన్ హాజరుకాలేదని విచారణ సందర్భంగా ఈడీ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. అయితే సోరెన్ తరఫు హాజరైన సీనియర్ న్యాయవాది ఆ వాదనను తోసిపుచ్చారు. సోరెన్ మూడుసార్లు హాజరయ్యారని, ఈడీ ఆయనను అరెస్టు కూడా చేసిందని చెప్పారు. తమ పిటిషన్‌ను మెజిస్ట్రేట్ పరిగణనలోకి తీసుకున్న ఏడాది తర్వాత ఆలస్యంగా సోరెన్ క్వాషింగ్ పిటిషన్ వేసినట్టు ఈడీ తరఫు న్యాయవాది వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, ఈడీ బల్క్ కంప్లయింట్లు చేసినట్టు వార్తాపత్రికలో చదివామని, ఫిర్యాదులపై దృష్టిసారించడం కంటే నిర్మాణాత్మక ఫలితాలతో ముందుకు రావాలని ఈడీకి సూచించింది.సోరెన్‌కు భూముల కుంభకోణంలో ప్రమేయం ఉందని ఈడీ ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కేసును కొట్టివేయాలని సోరెన్ వేసిన పిటిషన్‌ను జనవరి 15న హైకోర్టు కొట్టివేసింది. దీంతో తమ సమన్లకు స్పందించడం లేదంటూ ఈడీ ఫిర్యాదు చేసింది. దీనిపై సుప్రీంకోర్టుకు వెళ్లడంతో ఈడీ క్రిమినల్ ప్రొసీడింగ్స్‌పై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది.






# సంపాదకీయం

గురువారం 26-02-2026

## ఆసక్తకరంగా తమిళ రాజకీయాలు

తమిళనాడు రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది.తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల వేడి రాజుకుంటోంది. 'తమిళగ వెట్రి కళగం పార్టీ అధ్యక్షుడిగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సినీ నటుడు దళపతి విజయ్ . అధికార డీఎంకే సీఎం ఎంకె స్టాలిన్ లక్ష్యంగా విమర్శల దాడిని తీవ్రం చేశారు. వేలూర్‌లో నిర్వహించిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఆయన.. అధికార పక్షంపై సంచలన ఆరోపణలు చేశారు. రాబోయేది కేవలం ఎన్నికలు కాదని, అవినీతి ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు మధ్య జరగబోయే మహా యుద్ధమని, ఇందులో అంతిమ విజయం ప్రజలదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి, అందరూ చిన్నమ్మ అని పిలుచుకునే శశికళ తన కొత్త రాజకీయ ప్రస్థానాన్ని అధికారికంగా ప్రారంభించారు. జయలలిత జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆమె తన కొత్త రాజకీయ పార్టీ జెండాను ఆవిష్కరించారు. శశికళ ఆవిష్కరించిన పార్టీ జెండాను నలుపు, తెలుపు, ఎరుపు రంగులతో ఉంది. అత్యంత ప్రాముఖ్యత కలిగిన అంశం ఏంటంటే.. ఈ జెండా మధ్యలో ద్రవిడ రాజకీయ దిగ్గజాలు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత ముఖచిత్రాలను పొందుపరిచారు. తద్వారా తానే జయలలిత అసలైన రాజకీయ వారసురాలినని ఆమె పరోక్షంగా కేడర్‌కు సంకేతాలు పంపారు.సభలో ప్రసంగిస్తూ శశికళ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. జయలలిత మరణం తర్వాత తనపై జరిగిన దుష్ప్రచారాన్ని గుర్తు చేసుకుని ఆమె కన్నీరు పెట్టుకున్నారు. జయలలిత నేనే హత్య చేశానని ప్రచారం చేసి నా మనసును గాయపరిచారు. జయలలిత మరణించిన సమయంలో నేను తీవ్రమైన దుఃఖంలో ఉన్నాను. అందుకే అప్పుడు చాలా మంది బతిమలాడినా నేను పార్టీ అధ్యక్ష పదవిని గానీ, సీఎం పదవిని గానీ తీసుకోలేదు అని శశికళ ఆవేదన వ్యక్తం చేశారుప్రస్తుత అన్నాడీఎంకే అగ్రనాయకత్వంపై ఆమె నిప్పులు చెరిగారు. పన్నీర్ సెల్వం అప్పట్లో ఆయన తనను తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. పళనిస్వామిని సీఎంను చేయడం తాను చేసిన అతి పెద్ద పొరపాటు అని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి పీఠం ఎక్కిన తర్వాత తనను ఒక చిత్తుకాగితంలా చూశారని, చివరకు హీనంగా పార్టీ నుంచి బహిష్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు.జయలలిత చనిపోయిన తర్వాత తమిళనాట అనేక చిత్ర విచిత్రాలు జరిగాయని, ఇకపై తాను మౌనంగా ఉండబోనని శశికళ స్పష్టం చేశారు. "తమిళ రాజకీయాల్లో ఇక నా మార్క్ చూపిస్తాను.. ప్రజల కోసం యాక్టివ్‌గా పని చేస్తాను" అని ఆమె ప్రకటించారు. పార్టీ పేరు, విధివిధానాలపై త్వరలోనే స్పష్టమైన ప్రకటన చేస్తానని ఆమె తెలిపారు.ప్రభుత్వ అవినీతిని, అక్రమాలను తాను నిర్భయంగా ప్రశ్నిస్తున్నందుకే అధికార పార్టీ తనను ప్రధాన లక్ష్యంగా చేసుకుందని విజయ్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలను కలవకుండా అడ్డుకునేందు కు టీవీకే పార్టీ సభలకు సైతం ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అనుమతులు నిరాకరిస్తోందని మండిపడ్డారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా, కుట్రలు పన్నినా తాను వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. "ఇప్పుడు నన్ను ప్రజల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకోవచ్చు.. కానీ ఎన్నికల్లో గెలిచి మా పార్టీ అధికారంలోకి వచ్చాక నేనే స్వయంగా ప్రతి గ్రామాన్ని సందర్శిస్తాను'' అని విజయ్ సభాముఖంగా హామీ ఇచ్చారు.రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, నేరాలను అరికట్టడంలో స్టాలిన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విజయ్ ధ్వజమెత్తారు. సీఎం స్టాలిన్ కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. పరిస్థితులకు అనుగుణంగా అవకాశవాద రాజకీయాలు చేయడం డీఎంకేకు వెన్నతో పెట్టిన విద్య అని, రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదన్న భయంతో వారు బీజేపీతో పొత్తు పెట్టుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేకు ఓటు వేయడమంటే.. పరోక్షంగా బీజేపీకి ఓటు వేసినట్లేనని ఆయన కుండబద్దలు కొట్టారు.తాము అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని దేశంలోనే అత్యంత సురక్షితమైన ప్రాంతంగా మారుస్తానని విజయ ప్రతిజ్ఞ చేశారు. ముఖ్యంగా విద్య, భద్రతపై కీలక హామీలు ఇచ్చారు. నిరుపేద, మధ్యతరగతి విద్యార్థులు పోటీ పరీక్షల శిక్షణ కోసం లక్షల రూపాయలు ప్రైవేట్ సంస్థలకు పోయాల్సిన అవసరం లేకుండా .. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే ఉచితంగా నాణ్యమైన శిక్షణను అందిస్తామన్నారు. మారుమూల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో సైతం బాలికల కోసం పరిశుభ్రమైన, సురక్షితమైన మరుగుదొడ్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. నేర రహిత సమాజం కోసం, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత : ఎస్పీ శరత్ చంద్ర పవార్

నీలగిరి, ఫిబ్రవరి 25 : రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా మాడుగులపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన కార్యక్రమంలో భాగంగా మాడుగుల పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రైవర్లకు ప్రత్యేకంగా ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో




ఎస్పీ పాల్గొని మాట్లాడారు. "డ్రైవర్‌కు కంటి చూపు సరిగ్గా లేకపోతే అది ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతుందన్నారు. ప్రతి డ్రైవర్ నిర్దిష్ట కాల వ్యవధిలో ఒకసారి అయినా కంటి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఇది తన భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కాపాడే చర్య అని పేర్కొన్నారు.అలాగే రోడ్డు ప్రమాదాలు నివారణ గురించి మాట్లాడుతూ ముఖ్యంగా రోడ్డు భద్రత నియమాలను పైన అవగాహన లోపం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. నిర్లక్ష్య డ్రైవింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించవచ్చని అన్నారు. మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం ప్రమాదకరమన్నారు. అలాగే రోడ్డు ప్రమాదంలో ప్రమాదానికి గురైన వ్యక్తులను ప్రాథమిక చికిత్స నిమిత్తం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, డాక్టర్లు సీపీఆర్ పైన అవగాహనా కల్పించారు. "సురక్షిత ప్రయాణం ? సంతోషకర గమ్యం" అనే లక్ష్యంతో అందరూ కలిసి పని చేయాలని ఎస్పీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.అనంతరం రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ వాహనాలు నడుపుతూ ప్రమాదాల నివారణకు కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు, ఎస్బి సీఐ రాము, మిర్యాలగూడ రూరల్ సీఐ పిఎన్డి ప్రసాద్, మాడుగులపల్లి ఎస్ఐ కృష్ణ, డిటిఆర్బి రిటైర్ సీఐ అంజయ్య, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, ఏంపిడిఓ, ఎమ్మార్వో, వైద్య బృందం, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు పనులను పది రోజుల్లో పూర్తి చేయాలి'

### నల్లగొండ కలెక్టర్ బి.చంద్రశేఖర్

నల్లగొండ సిటీ, ఫిబ్రవరి 25 : నల్లగొండ జిల్లాలో పైలెట్ పద్ధతిన ఎంపిక చేసిన గ్రామాల్లో గృహ జ్యోతి లబ్ధిదారులకు అమలు చేస్తున్న "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు పనులను మార్చి మొదటి వారంలోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కనగల్ మండల కేంద్రంలో టీఎస్ రెడ్ కో ఆధ్వర్యంలో గృహజ్యోతి లబ్ధిదారులకు అమలు చేస్తున్న "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కనగల్ గ్రామంలో 292 మంది గృహ జ్యోతి లబ్ధిదారులు ఉండగా, వీరికి రూఫ్ టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు చేసేందుకు



పైలట్ పద్ధతిన ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. అంతేకాక జిల్లాలోని అనుముల మండలం అనుముల, దేవరకొండ మండలం ముదిగొండ గ్రామాలలో సైతం పైలెట్ పద్ధతిన "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ మూడు గ్రామాలలోని గృహ జ్యోతి లబ్ధిదారుల ఇళ్లపై రెండు కిలోవాట్ల " రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేస్తారని, కనగల్ గ్రామంలో ఇప్పటికే 77 ఇళ్లపై "రూఫ్ టాప్ సోలార్ సిస్టం" ఏర్పాటు చేసే పనులు మొదలైనట్లు వెల్లడించారు.అనంతరం పక్కనే నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇంటిని కలెక్టర్ పరిశీలించారు. లబ్ధిదారు నల్లబోతు వెంకటమ్మతో మాట్లాడి నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారితో మాట్లాడుతూ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ నెలాఖరునాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. కనగల్ మండలంలో ఇప్పటివరకు కేవలం 47% మాత్రమే ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం జరిగిందని, అందువల్ల రైతులందరూ ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా అవగాహన కల్పించి ప్రోత్సహించాలన్నారు. ఇందుకు సర్పంచ్ మురళీధర్ సహకరించాల్సిందిగా కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్ కో జిల్లా మేనేజర్ సంతోష్, ట్రాన్స్‌కో ఏఈ ఆర్ ఎన్.జె.కుమార్, తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ వేద రక్షిత, సెక్రటరీ వీరబాబు పాల్గొన్నారు.

## కుమ్మెర బాధితులకు అండగా నిలిచి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

### .. పోలీసులకు ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ ఆదేశాలు

నాగర్ కర్నూల్ : జిల్లాలోని కుమ్మెర బాధితులకు అండగా నిలిచి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులను సహించబోమని వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లో కుమ్మెర బాధితులను కమిషన్ సభ్యుడు శంకర్‌తో కలసి పరామర్శించారు.అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ , ఇతర పోలీస్ అధికారులతో కలిసి ఘటనకు సంబంధించిన పూర్వాపరాలు, కేసు నమోదు ప్రక్రియ, బాధ్యులపై తీసుకుంటున్న చర్యలు, బాధితులకు అందిస్తున్న వైద్య సహాయం వంటి



అంశాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారి తల్లిదండ్రులు గణేష్, మౌనిక కుటుంబ సభ్యులతో ఘటన పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు.ాధితులకు అన్ని విధాలుగా హామీ ఉంటామని, నిందితులకు కఠిన శిక్షలు అమలు జరిగే వరకు ఎస్సీ ఎస్టీ కమిషన్ బాధ్యతల పక్షాన నిలుస్తుందని, బాధితులకు భరోసా ఇచ్చారు. దర్యాప్తును వేగవంతం చేసి, బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని ఆదేశించారు.1989 చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమాజంలో సమానత్వం, భద్రత కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని, ఎస్సీ, ఎస్టీల హక్కులను రక్షించడంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. కుమ్మెర ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహతో మాట్లాడి బాధ్యతలకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, కుమ్మెర కేసును త్వరగా పరిష్కరించేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి, బాధితులకు సత్వర న్యాయం అందించే దిశగా కమిషన్ కృషి చేస్తుందని వివరించారు.కుమ్మెర బాధితులకు తక్షణ ఖర్చుల నిమిత్తం గణేష్, మౌనికకు లక్ష రూపాయల చెక్కును అందజేశారు. వచ్చే మూడు నెలల పాటు వారికి నిత్యవసర సరుకులు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆయన ఆదేశించారు. నిందితులపై హత్య కేసుతో పాటు ఎస్సీ ఎస్టీ కేసు బుక్ చేయాలని జిల్లా ఎస్పీకి సూచించారు. బాధ్యులు కుమ్మర గ్రామంలో వెళ్లడానికి ప్రాణహాని ఉంటుందని వారు భయంతో ఉన్నారని, నాగర్ కర్నూల్ లోని డబల్ బెడ్ రూమ్ ఏర్పాటు చేసి గణేష్ కు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు.

## అమెరికాలో కొనసాగుతున్న మంచు తుఫాన్.. ఈశాన్యంలో జనజీవనం అస్తవ్యస్తం



అగ్రరాజ్యం అమెరికాలో మంచు తుఫాను కొనసాగుతున్నది. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలను మంచుదుప్పటి కప్పేసింది. రికార్డు స్థాయిలో 3 అడుగుల మేర మంచు కురిసింది. రోడ్ ఐల్యాండ్‌లోని ఎయిర్‌పోర్టులో అయితే 38 అంగుళాల మేర మంచు నిండిపోయింది. ఈ హిమపాతం కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఎక్కడికక్కడ మంచు పేరుకుపోవడంతో రవాణా వ్యవస్థలకు అంతరాయం ఏర్పడింది. విమాన సర్వీసులు రద్దయ్యాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంచు, బలమైన గాలుల కారణంగా పాఠశాలలు, వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. అయితే ఇప్పుడిప్పుడే కొన్ని నగరాల్లో రవాణా సాధారణ స్థితికి వస్తోంది. మసాచుసెట్స్, న్యూజెర్సీ, డెలవేర్, రోడ్ ఐల్యాండ్‌లోని కొన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు.అయితే ఇంకా కొన్ని ప్రాంతాల్లో ప్రజలు అంధకారంలోనే ఉండిపోయారు. మంచువల్ల కొన్ని ప్రాంతాల్లో రైలు సర్వీసులు నిలిచిపోగా.. మరికొన్ని చోట్ల యథావిధిగా నడిచాయి. ఇదిలావుంటే.. గ్రేట్‌లేక్స్‌లో మరో తుఫాను రానున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీచేసింది. అయితే దీని తీవ్రత ఎక్కువగా ఉండనప్పటికీ కొన్ని ప్రాంతాలు ప్రభావితమవుతాయని పేర్కొన్నది.

## అమరగార్డ్నిక్ ట్రోఫోబ్లాస్టోమా చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన యశోద ఆస్పత్రి

హైదరాబాద్,అరుదైన ఎముక మజ్జ వ్యాధి 'అమరగార్డ్నిక్ ట్రోఫోబ్లాస్టోమా'తో బాధపడుతున్న 10 నెలల చిన్నారికి యశోద ఆస్పత్రుల వైద్యులు విజయవంతంగా చికిత్స అందించారు. తీవ్ర అనారోగ్య పరిస్థితిలో ఆస్పత్రికి తరలించగా, వైద్యులు వెంటనే పరీక్షలు నిర్వహించి వ్యాధిని గుర్తించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి క్లిష్టంగా ఉండటంతో నిపుణుల బృందం ప్రత్యేక చికిత్స ప్రణాళిక రూపొందించింది. హీమటాలజీ, పీడియాట్రిక్ విభాగాల వైద్యులు సమన్వయంతో ఆధునిక వైద్య పద్ధతులు అనుసరించి చికిత్స చేపట్టారు. నిరంతర పర్యవేక్షణలో చిన్నారికి అవసరమైన సంరక్షణ అందించారు. కొద్ది రోజుల చికిత్స అనంతరం చిన్నారి ఆరోగ్యంలో స్పష్టమైన మెరుగుదల కనిపించింది. వైద్య బృందం సమర్థవంతమైన చికిత్సతో ప్రస్తుతం చిన్నారి సాధారణ స్థితికి చేరుకుని కోలుకుంటున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. అరుదైన, క్లిష్టమైన వ్యాధుల చికిత్సలో యశోద ఆస్పత్రులు ముందంజలో ఉన్నాయని ఆస్పత్రి ప్రతినిధులు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు, ఆధునిక సాంకేతిక సదుపాయాలతో ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.

## సులానగర్ జడ్పీహెచ్ఎస్‌లో మధ్యాహ్న భోజనం పరిశీలన



టేకులపల్లి, ఫిబ్రవరి 25 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం సులానగర్ గ్రామ పంచాయతీలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సర్పంచ్ గుగులోత్ లక్ష్మణానాయక్, ఉప సర్పంచ్ ఉండేటి చెన్నయ్య బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఈ సందర్భంగా వారు ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు.

## తెలంగాణలో లిక్కర్ తయారీ కేంద్రం పేరుతో ఘరానా మోసం

హైదరాబాద్,బేవరేజెస్ గోదాం, పబ్బులు, లిక్కర్ లైసెన్సులు ఇప్పిస్తామంటూ కోట్లు వసూళ్లు చేసిన అక్కల రామకృష్ణ ప్రసాద్ ను సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసారు. ఆస్ట్రేలియా సిటిజన్ అంటూ హైదరాబాద్లో పలువురి వ్యాపారులతో పరిచయం ఏర్పాటు చేసుకొని బురిడీ కొట్టించాడు. వ్యాపారి నరేందర్ ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసుకున్న హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు, నిందితుడిని అరెస్టు చేసారు.ఎల్వోసీ జారీచేసి పారిపోతుండగా సిసిఎస్ పోలీసులు పట్టుకున్నారు.బాధితుడు నరేందర్ కు బేవరేజ్ ఫ్యాక్టరీ పెట్టిస్తానంటూ కోటి 30 లక్షలు విడతల వారీగా వసూలు చేసి పరారైయాడు. తండ్రి వరప్రసాద్, మరో నిందితుడు విక్రమ్ కోసం స్పెషల్ టీం ఏర్పాటు చేసి గాలిస్తున్నారు. ల్యాండ్ కొన్నానంటూ, సొంత ఫ్లాట్ అంటూ వ్యాపారులని నమ్మించి నట్టేట ముంచాడు. రామకృష్ణ పై ఆస్ట్రేలియాలో అనేక చీటింగ్ కేసులు, ఆస్ట్రేలియాలో జైలు జీవితం గడిపినట్లు సమాచారం. రామకృష్ణ చేతిలో ఎవరైనా మోసపోయి ఉంటే హైదరాబాద్ సిసిఎస్ పోలీసులని ఆశ్రయించండి అంటూ ప్రకటించారు. రామకృష్ణ విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి వ్యాపారవేతలను టార్గెట్ గా చేసి కోట్లాది రూపాయలు డబ్బులు వసూళ్లు చేస్తున్నాడు. సింగపూర్, మలేషియా, థాయిలాండ్, బెంగళూర్, ముంబై ప్రాంతాల్లో వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టించి అధిక లాభాలు వస్తాయంటూ నమ్మిస్తున్నాడు.

# ఏపీలో బీసీ రిజర్వేషన్లు

విజయవాడ, ఫిబ్రవరి 25,స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. శాసనసభలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలతోపాటు ఆహార పౌరసరఫరాలశాఖకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి గ్రాంట్ల కోసం అభ్యర్థనపై చర్చ తర్వాత చంద్రబాబు మాట్లాడారు. ఎన్డీయే పై ఎంతో నమ్మకంతో ఓట్లేసి గెలిపించారు. ఆ నమ్మకాన్ని కాపాడుకోవాలి. వైసీపీ హయాంలో బీసీ రిజర్వేషన్లు 33 శాతం నుంచి తగ్గించారు. మళ్లీ వాటిని పెంచడానికి ఏకసభ్య కమిషన్ వేశాం. నివేదిక రాగానే చట్టం చేసి అమలుచేస్తాం. బీసీల రక్షణకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటుచేశాం. వారిచ్చే నివేదికను అమలు చేస్తాం. బీసీ వర్గాల్లోని కొందరు తమను ఎస్సీ, ఎస్టీల్లో చేర్చాలని కోరారు. వాటిని కేంద్రానికి పంపాం అని తెలిపారు.బలహీనవర్గాల సంక్షేమమవే లక్ష్యంగా పాలన సాగిస్తాం. ప్రజాప్రతినిధులు ఏ పనిచేసినా, దాని ద్వారా బలహీనవర్గాల్ని ఎంతవరకు ఆదుకుంటున్నామన్న సంగతి దృష్టిలో ఉంచుకోవాలి. ఇది బలహీనవర్గాల ప్రభుత్వం. వారికి అన్నివిధాలా అండగా ఉంటాం అని వెల్లడించారు. ఎస్సీ వర్గీకరణ 1996‘97లో తొలిసారిగా టీడీపీ ప్రభుత్వమే తెచ్చింది. తర్వాత వచ్చిన ప్రభుత్వాలు దాన్ని కాపాడలేకపోయాయి. సుప్రీంకోర్టు అనుమతివ్వడంతో మళ్లీ ఎస్సీ వర్గీకరణ అమలు చేసి దామాషా ప్రకారం సామాజిక న్యాయం చేశాం అని తెలిపారు.తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలు అసంతృప్తి, అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షంలో ఉండగా కేసులకు భయపడకుండా అప్పటి ప్రభుత్వాన్ని ఎదిరించిన వారికి నేడు అధికారంలోకి వచ్చిన రెండేళ్లకు కూడా గుర్తింపు లేదని కార్యకర్తలు వాపోతున్నారు. మాజీ ఫైబర్ నెట్ ఛైర్మన్ జీవీ రెడ్డి కూడా చంద్రబాబు, లోకేశ్ లు కేవలం పాలనపై దృష్టి పెట్టకుండా పార్టీ క్యాడర్ గురించి ఆలోచిస్తే మంచిదని ఇటీవల ఒక యూట్యూబ్ ఛానల్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. అనేక మంది పార్టీకి చెందిన కార్యకర్తల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇతర పార్టీల నుంచి ఎన్నికలకు ముందు వచ్చిన వారికి ఉన్న గుర్తింపు గత ఐదేళ్లు జెండా మోసిన వారికి ఎక్కడుందంటూ సోషల్ మీడియాలో క్యాడర్ ప్రశ్నిస్తున్నారు.తెలుగుదేశం పార్టీ అభిమానిని అని చెప్పుకుని ముందు వరుసలో నిలబడిన చాలామంది అధికారంలో ఉండగా దూరం అవుతున్నారు. అంతే కాదు వారంతా టీడీపీ అని చెప్పుకునేందుకు ఇష్టపడటం లేదు. 2014 లో పార్టీ పిలుపు అందుకొని సమైక్య రాష్ట్రం కోసం పోరాటం, విభజిత ఆంధ్ర ప్రదేశ్ లో కేసీఆర్ ను సోషల్ మీడియాలో ఉతికి ఆరేయడం, జగన్ బ్యాచ్ దృష్టిలో పడి వాళ్ళ అరాచకాలను ఎదుర్కోవడానికి అనేక తిప్పలు పడ్డ వారంతా నేడు సైలెంట్ అయ్యారు. వారిని స్థానిక ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో పాటు వైసీపీ నుంచి వచ్చిన వారికి ప్రాధాన్య ఇవ్వడాన్ని కూడా తప్పుపడుతున్నారు. కార్యకర్తల సమావేశంలో తాము చంద్రబాబుతో నేరుగా ఫిర్యాదు చేయాలన్నా కొందరు అడ్డుకుంటున్నారంటున్నారు. 2014 నుండి టీడీపీ ప్రభుత్వం లో ఏమాత్రం ప్రతిఫలం ఆశించకుండా పనిచేసిన వారు నేడు నాయకత్వానికి కనిపించకుండా పోవడం పట్ల ఆవేదన చెందుతున్నారు. సొంత డబ్బులు ఖర్చు చేసుకుని మరీ పార్టీని ముందుకు నడిపించినా అధికారంలోకి వచ్చినా ఏ మాత్రం ప్రయోజనం లేదని అంటున్నారు. 2019 చాప కింద నీరులాగా ప్రజల్లో నెగటివ్ టాక్ తో టీడీపీ ఓడిపోయింది. అయిదేళ్లు పార్టీ కోసం నిలబడిన వాళ్ళకు కేసులు , అప్పులు మిగిలాయన్న ఆవేదన వారిలో కనపడుతుంది. పార్టీ అధికారంలోకి రావడానికి ఎన్నో త్యాగాలు చేసిన కార్యకర్తలు, అభిమానులు కనుమరుగు అయిపోయారని వారు నెట్టింట ఆవేదన చెందుతున్నారు. అగ్రనేతల దృష్టిలో ఉన్న కొద్ది మందికి కార్పోరేషన్ల పదవులు దక్కాయని, మిగిలిన వారికి రిక్త హస్తాలు చూపుతున్నారంటున్నారు. మరి తమ్ముళ్ల ఆవేదన ఇప్పటికైనా పార్టీ అగ్రనాయకత్వం చెవికి చేరుతుందా? లేదా? అన్నది చూడాలి.

# విజయవాడవాసులకు పండగే..

## కొత్తగా 100 ఎలక్ట్రికల్ బస్సులు, 11 రూట్‌లలో పరుగులు




విజయవాడ, ఫిబ్రవరి 25, ఏపీకి కేంద్రం పీఎం ఈ-బస్ సేవా పథకం కింద విద్యుత్ బస్సులు కేటయించిన సంగతి తెలిసిందే. అయితే ఈ బస్సుల్లో విజయవాడకు ఏకంగా 100 బస్సుల్ని కేటాయించారు. అయితే ఈ బస్సులు మరో ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తాయని చెబుతున్నారు. ఈ బస్సుల నిర్వహణ కోసం విద్యాధరపురం డిపోలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బస్సులు మొత్తం 11 రూట్లలో అందుబాటు లోకి రానున్నాయి.ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో పీఎం ఈ-బస్ సేవా పథకం ద్వారా రాష్ట్రానికి ఎలక్ట్రికల్ బస్సులు తీసుకొస్తోంది. ప్రధాన నగరాలకు ఈ బస్సుల్ని కేటాయించారు.. అయితే విజయవాడకు కూడా భారీగా బస్సుల్ని కేటాయించారు. విజయవాడకు మొత్తం 100 బస్సులు కేటాయించారు.. ఈ బస్సుల నిర్వహణ కోసం విద్యాధరపురం డిపోలో ఏర్పాట్లు చేయనున్నారు. ఈ బస్సులకు సంబంధించిన ఒప్పందం కూడా పూర్తి చేయగా.. మరో ఆరు నెలల్లో బస్సులు విజయవాడలో పరుగులు తీయనున్నాయి. ఈ ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ భారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే.విజయవాడ నగరంలో మొత్తం 400 బస్సు?లు ఉన్నాయి.. అయితే కొత్తగా ఎలక్ట్రిక్ బస్సులు రానుండటంతో.. పాత బస్సుల్ని పక్కన పెడతారు. ఈ ఎలక్ట్రిక్ బస్సులతో దాదాపుగా 7వేల లీటర్ల డీజిల్ వరకు ఆదా అవుతుంది.. కాలుష్యం కూడా తగ్గుతుందంటున్నారు. విద్యాధరపురం డిపోలో ఈ బస్సుల నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాదు విద్యాధరపురం డిపోను పూర్తిగా ఎలక్ట్రిక్ బస్సుల కోసం కేటాయిస్తున్నారు.. అక్కడ ఉన్న బస్సుల్ని పొరుగున ఉన్న డిపోలకు తరలిస్తారు.. ఉద్యోగుల్ని కూడా అక్కడికి పంపిస్తారని చెబుతున్నారు.విద్యాధరపురం డిపోలో అవసరమైన పనులు చేపట్టేందుకు రూ.12.5 కోట్లు కేటాయించారు. ఈ ఎలక్ట్రిక్ బస్సుల కోసం సబ్ స్టేషన్ (6,000 కేవీ), ఛార్జింగ్ స్టేషన్ నిర్మిస్తారు. మొత్తం 20 ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో పాయింట్‌లో ఐదు బస్సుల్ని ఛార్జ్ చేసుకోవచ్చు. అయితే నిధుల్లో కేంద్రం 60శాతం, రాష్ట్రం 40శాతం సమకూరుస్తాయి. ఈ బస్సుల నిర్వహణ బాధ్యతను పినాకిల్ మొబిలిటీ సంస్థకు అప్పగించారు. ఈ బస్సుల్లో విధులు నిర్వహించేందుకు మొత్తం 250 మంది డ్రైవర్లను పినాకిల్ సంస్థ సమకూరుస్తుంది. ఈ బస్సులకు సబంధించి అవసరమైన 250 మంది కండక్టర్లను ఆర్టీసీ సర్దుబాటు చేయనుంది. ఒక్కో బస్సులో 40 సీట్లు ఉంటాయి.. అలాగే ఉచిత బస్సు పథకం స్త్రీశక్తి కూడా వర్తిస్తుంది. విజయవాడకు కేటాయించిన మొత్తం 100 బస్సులు 11 రూట్లలో అందుబాటులోకి రానున్నాయి.

# మూడేళ్ల ముందు నుంచే లెక్కలు

గుంటూరు, ఫిబ్రవరి 25, ఆంధ్రప్రదేశ్ లో 2029 ఎన్నికలు ఇంకా మూడు సంవత్సరాల దూరంలో ఉన్నప్పటికీ, రాజకీయ పార్టీల్లో ఇప్పటి నుంచే చురుకుదనం కనిపిస్తోంది. అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ , ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , అలాగే కూటమిలో భాగమైన జనసేన పార్టీ తమ తమ స్థాయిలో వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నాయి. ప్రజాభిప్రాయాన్ని తమవైపు తిప్పుకునేందుకు ప్రతి పార్టీ వేర్వేరు మార్గాలను అనుసరిస్తోంది.ప్రస్తుతం అధికార కూటమిలో కీలక పాత్ర పోషిస్తున్న నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పథకాల అమలుపై దృష్టి పెట్టారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు వంటి అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుని ముందుకు సాగుతున్నారు. రాష్ట్ర ఆర్థిక స్థితిని బలోపేతం చేసి, ప్రజలకు ప్రత్యక్ష లాభాలు చేకూరేలా కార్యక్రమాలు చేపడితే అది ఎన్నికల సమయంలో తమకు అనుకూలంగా మారుతుందని పార్టీ నేతలు భావిస్తున్నారు.ఇక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహిస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిప్రజా సమస్యలపై కఠిన వైఖరిని అవలంబిస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాల్లో లోపాలను ఎత్తిచూపుతూ, తమ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేస్తున్నారు. గ్రామ స్థాయి నాయకత్వాన్ని బలోపేతం చేసి, తిరిగి ప్రజల్లో నమ్మకం పెంపొందించేందుకు ప్రయత్నిస్తున్నారు. పార్టీ అంతర్గత వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం ద్వారా 2029లో బలంగా పోటీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.జనసేన పార్టీకి నాయకత్వం వహిస్తున్న పవన్ కళ్యాణ్ యువత, మధ్యతరగతి వర్గాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ, పార్టీ బలాన్ని పెంచే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. భవిష్యత్తులో రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయో చెప్పడం కష్టం అయినప్పటికీ, జనసేన తన ప్రాతినిధ్యాన్ని పెంచుకోవాలని చూస్తోంది.ఏ పార్టీ ముందుందనే ప్రశ్నకు ఇప్పుడే స్పష్టమైన సమాధానం చెప్పడం కష్టమే. ఎన్నికల ఫలితాలు అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, నాయకత్వంపై ప్రజల అభిప్రాయం, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలు కీలక పాత్ర పోషిస్తాయి. అలాగే యువ ఓటర్ల పాత్ర కూడా 2029 ఎన్నికల్లో ప్రధానంగా ఉంటుంది.రాజకీయంగా చూస్తే ప్రతి పార్టీ తన బలం, బలహీనతలను విశ్లేషించుకుంటూ ముందుకు సాగుతోంది. ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా పని చేసే పార్టీకి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇంకా ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ, ఇప్పటి చర్యలు భవిష్యత్తు ఫలితాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. 2029లో ఏ పార్టీ ముందుంటుందో చెప్పడానికి సమయం ఇంకా ఉంది, కానీ సన్నాహాలు మాత్రం వేగంగా కొనసాగుతున్నాయి.

# ఆదర్శంగా ఎమ్మెల్సీ

విజయవాడ, ఫిబ్రవరి 25, ఆంధ్రప్రదేశ్ శాసనసభ.. రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అత్యున్నత వేదిక. కానీ, దురదృష్టవశాత్తూ అది ఇప్పుడు 'గిఫ్ట్ కూపన్ల' కోసం ప్రజాప్రతినిధులు ఎగబడే సంతగా మారిందా? అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రానికి దిశానిర్దేశం చేయాల్సిన నేతలు, లక్ష రూపాయల ఉచిత వోచర్ల కోసం చేతులు చాచడం చూస్తుంటే.. ప్రజాస్వామ్యం సిగ్గుతో తలదించుకుంటోంది. ఈ చీకటి రాజకీయంలో ఒకే ఒక్కడు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, అందరికీ ఆదర్శంగా నిలిచారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. కొత్త అప్పు పుడితేనే పాత అప్పుకు వడ్డీ కట్టే దుస్థితి. సామాన్యుడిపై పన్నుల భారం, నిరుద్యోగుల ఆకలి కేకలు, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ ఫలాలు.. ఇన్ని సమస్యల మధ్య అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రజాప్రతినిధులందరికీ తలా రూ.1,00,000×× విలువైన షాపింగ్ కూపన్లు పంచడం ఏ రకమైన పరిపాలన?ప్రభుత్వ ఖజానా అంటే పాలకుల సొంత ఆస్తి కాదు, అది సామాన్య పౌరుడు చెమటోడ్చి కట్టిన పన్ను డబ్బు. ఆ డబ్బుతో ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు లక్షల రూపాయల 'నజరానాలు' ఇవ్వడం అనైతికం మాత్రమే కాదు, అప్రజాస్వామికం కూడా.అసెంబ్లీలో అడుగుపెట్టిన వారిలో అత్యధికులు వందల కోట్ల ఆస్తులున్న వారే. వారి కార్లు, వారి విలాసాలు, వారి జీవనశైలి సామాన్యుడికి అందనంత ఎత్తులో ఉంటాయి. అలాంటి వారు కూడా, ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే లక్ష రూపాయల వోచర్ కోసం క్యూ కట్టడం చూస్తుంటే.. వారి ఆశకు అంతం లేదా అనిపిస్తోంది. సొంతంగా లక్ష రూపాయల వస్తువులు కొనుక్కునే స్తోమత వీరికి లేదా? రాష్ట్రం కష్టాల్లో ఉన్నప్పుడు 'మాకు ఈ వోచర్లు వద్దు, ఆ డబ్బును పేదలకో, పాఠశాలలకో ఖర్చు చేయండి' అని చెప్పే దమ్ము ఒక్కరికైనా ఉందా?అందరూ ఆశకు దాసోహమన్న వేళ, గురుమూర్తి మాత్రం తన ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టలేదు. చేతికి అందిన కూపన్‌ను నిర్మొహమాటంగా తిరస్కరించి, వెనక్కి ఇచ్చేసి.. రాజకీయ యవనికపై ఆదర్శంగా నిలిచారు. “రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ఇలాంటి అనవసర వ్యయాలు ఎందుకు? ప్రజల సొమ్ముతో మాకు విలాసాలు అవసరమా?” ఆయన అడిగిన ఈ ఒక్క ప్రశ్న.. మిగిలిన ప్రజాప్రతినిధుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఆయన తిరస్కరించింది కేవలం ఒక కూపన్‌ను మాత్రమే కాదు, వ్యవస్థలో వేళ్లూనుకుపోయిన 'అవినీతి', 'అనవసర వ్యయ' సంస్కృతిని!ఈ ఉదంతం ద్వారా పాలకపక్షం నేర్చుకోవాల్సింది చాలా ఉంది. అసలు బడ్జెట్ సమావేశాల పేరిట ఇలాంటి కూపన్ల సంస్కృతిని ప్రవేశపెట్టడం వెనుక ఉద్దేశం ఏమిటి? ప్రజాప్రతినిధులను సంతృప్తి పరచడమే పాలన అని భావిస్తున్నారా? 200 మందికి పైగా సభ్యులకు లక్ష రూపాయల చొప్పున అంటే.. కోట్ల రూపాయల ప్రజాధనం గాలిలో కలిసిపోయింది. రాష్ట్రం అప్పుల్లో ఉన్నప్పుడు పొదుపు పాటించాల్సింది పాలకులు. కానీ ఇక్కడ వేలితో చూపిస్తూ, నోటితో పొదుపు మంత్రాలు చదువుతూ.. చేతులతో మాత్రం ప్రజాధనాన్ని దోచిపెడుతున్నారు.బొర్రా గోపిమూర్తి కేవలం ఒక ఎమ్మెల్సీ మాత్రమే కాదు, ఈ తరం రాజకీయ నాయకులకు ఆదర్శ పాఠం. ఆయన చూపిన బాటలో నడవడానికి ఏ ఒక్క ఎమ్మెల్యేకైనా మనసు వస్తుందా? ప్రజాధనాన్ని కాపాడటమే అసలైన దేశభక్తి అని ఆయన నిరూపించారు.

# క్లైమాక్స్ కు చేరిన ఎమ్మెల్సీల కథ

విజయవాడ, ఫిబ్రవరి 25, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన ఎమ్మెల్సీల వ్యవహారం ఒక కొలిక్కి వచ్చే అవకాశం కనిపిస్తున్నట్లుంది. వైసీపీకి రాజీనామా చేసిన అయిదురుగు ఎమ్మెల్సీలకు శాసన మండలి ఛైర్మన్ మోషెన్ రాజు ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఈ అయిదురుగు తమ సమక్షంలో జరిగే విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ నెల 25న విచారణకు హాజరు కావాలని జయ మంగళం వెంకటరమణకు నోటీసులు ఇస్తే 26న హాజరు కావాలని కళ్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, పోతుల సునీత, మర్రి రాజశేఖర్ లకు నోటీసులు ఇచ్చారు. దీంతో రేపటి నుంచి రాజీనామా చేసిన వైసీపీ ఎమ్మెల్సీలను మోషేన్ రాజు విచారించనున్నారు. తమ రాజీనామాలకు గల కారణాలను మండలి ఛైర్మన్ కు వివరించనున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అయిదుగురు ఎమ్మెల్సీలు 2024 లో వరుసగా రాజీనామాలు చేశారు. అంతే కాదు పార్టీకి సైతం గుడ్ బై కొట్టారు. వీరిలో కొందరు టీడీపీలో చేరగా, జయమంగళ వెంకటరమణ జనసేనలో చేరారు. మర్రి రాజశేఖర్, కర్రి పద్మశ్రీ పసుపు కండువా కప్పుకున్నారు. పోతుల సునీత బీజేపీలో చేరారు. గత కొన్ని నెలల నుంచి వీరి రాజీనామాలు అన్నీ ఛైర్మన్ వద్ద పెండింగులో ఉన్నాయి. తమ రాజీనామాలు ఆమోదించాలని వీరంతా కోరుతూ వచ్చారు. తమ రాజీనామాలను ఆమోదించాలని వారు మండలిలోనూ ఛైర్మన్ కు విజ్ఞప్తి చేశారు. జయ మంగళం వెంకట రమణ అయితే హైకోర్టుకు వెళ్లి తన రాజీనామాపై నిర్ణయం తీసుకోవాలని ఛైర్మన్ ఆదేశించాలని కోరారు. దీనికి ర్టు కూడా వీరి విషయం చూడాలని తెలిపిందిఅయితే వీరిని విచారించేందుకు స్పీకర్ నోటీసులు జారీ చేశారు. మరి వీరు విచారణలో ఏమి చెబుతారో చూడాల్సి ఉంది. వీరు తాము మనస్ఫూర్తిగా రాజీనామాలు చేశామని ఎన్నో సార్లు మీడియా ముందు చెప్పారు. అయితే ఇటీవల జయమంగళం వెంకట రమణ అయితే జగన్ తనకు దేవుడు అన్నట్లుగా మాట్లాడారు. దాంతో అది సంచలనంగామారింది. జయమంగళ వెంకట రమణ తన మనసు మార్చుకున్నారా లేదా అన్నది ఈ విచారణ సందర్భంగా తేలనుంది. అలాగే మరి కొందరి విషయమో కూటమిలో సరైన ఆదరణ లేదని అంటున్నారు. దాంతో వారు ఏమైనా ఆలోచిస్తున్నారా అన్నది కూడా చర్చకు వస్తోంది. వీరు ఛైర్మన్ ఎదుట తమ అభిప్రాయాన్ని ఎలా చెబుతారన్నది కూటమి నేతలకు కూడా కొంత టెన్షన్ గా ఉంది.మండలి ఛైర్మన్ ఎమ్మెల్సీలను విచారించి వారి రాజీనామాల విషయంలో కీలక నిర్ణయం తీసుకుంటారా లేదా? అన్న దానిపై స్పష్టత రానుంది. అదే జరిగితే ఈ అయిదు సీట్లు ఖాళీ అవుతాయి. అపుడు వాటిలో ఎన్నికలు పెడితే తిరిగి కూటమికే ఆ సీట్లు వెళ్తాయి. ఈ విషయంలో ఇంత కాలం ఆగిన తరువాత ఇపుడు విచారణ అంటున్నారు అంటే వీరి విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని చూస్తున్నారా లేక విచారణ పేరిట సాగదీస్తారా? అన్న అనుమానాన్ని కూడా కూటమి నేతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. శాసనమండలిలో కూటమి కంటే వైసీపీ బలం ఎక్కువగా ఉంది. దీంతో రాజీనామాలు త్వరగా ఆమోదిస్తే మండలిలోనూ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టేందుకు వీలు లేకుండా చేసుకోవచ్చన్నది కూటమి నేతల అభిప్రాయంగా ఉంది. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

# ఏపీలో కొత్త సోలార్ పార్కు

అనంతపురం, ఫిబ్రవరి 25, ఏపీలో కొత్త సోలార్ పార్కు ఏర్పాటు కానుంది, శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలో సోలార్ పవర్ పార్కు ఏర్పాటు చేయడానికి ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.1200 కోట్లతో 200 మెగావాట్ల సోలార్ పార్కు ఏర్పాటు చేయడానికి అనుమతి ఇచ్చింది. యశస్వ పవర్ ఎల్ఎల్‌పీ ఈ సోలార్ పవర్ పార్కు ఏర్పాటు చేయనుంది. పరిగి మండలం బీచుగానిపల్లితో పాటుగా ఆ సమీప గ్రామాలలో ఈ సోలార్ పార్కు ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు రచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో సోలార్ పార్క్ ఏర్పాటు కానుంది. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలో 200 మెగావాట్ల సోలార్ పవర్ పార్కు ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రూ.1200 కోట్లతో యశస్వ పవర్ ఎల్ఎల్‌పీ ఈ సోలార్ పార్కును అభివృద్ధి చేయనుంది. ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ లక్ష్యాల సాధన దిశగా ఈ సోలార్ పార్కు ఉపయోగపడనుంది. అలాగే పలువురికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారులు తెలిపారు. మరోవైపు యశస్వ పవర్ ఎల్ఎల్‌పీ సంస్థ.. క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనుబంధ సంస్థ. శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలంలోని బీచిగానిపల్లి , ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ఈ సోలార్ పార్క్ ఏర్పాటు కోసం ప్రణాళికలు రచిస్తున్నారు.మరోవైపు ఏటా 445 మిలియన్ యూనిట్ల క్లీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంతో ఈ సోలార్ పార్కు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఈ ప్రాజెక్టు ద్వారా 690 మందికి



ప్రత్యక్షంగా. మరికొందరికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలుగుతాయని అధికారులు చెప్తున్నారు. 1200 ఎకరాల విస్తీర్ణంలో ఈ సోలార్ పార్కు ఏర్పాటుకానుంది.”ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పునరుత్పాదక ఇంధన రంగంలో క్లీన్‌మాక్స్ సంస్థ పెట్టుబడిని స్వాగతిస్తోంది. ఆంధ్రప్రదేశ్ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024కి అనుగుణంగా, పెద్ద ఎత్తున గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా రాష్ట్రాన్ని బలోపేతం చేస్తుంది” అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఓ ప్రకటన విడుదల అయ్యింది.మరోవైపు ఉమ్మడి అనంతపురం జిల్లాలో కరవు పరిస్థితులు ఎక్కువ. దీంతో ఈ ప్రాంతం నుంచి అటు కర్నాటక, ఇటు హైదరాబాద్ ప్రాంతాలకు జనం వలస పోతుంటారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో డ్రోన్లు, ఏరోస్పేస్, సోలార్ పార్కులు ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు అటు కర్ణాటక రాజధాని బెంగళూరు, ఇటు తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు మధ్యలో ఉండటంతో ఈ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నారు. జాతీయ రహదారి సౌకర్యం, సమీపంలోనే విమానాశ్రయాలు ఉండటంతో ఆసక్తి చూపుతున్నారు.

# 11 బిలియన్ డాలర్ల విలువైన ఏఐ డేటా సెంటర్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 25,విశాఖపట్నంలో 11 బిలియన్ డాలర్ల విలువైన ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు అవుతుందనే వార్త రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అంత పెద్ద స్థాయిలో పెట్టుబడి వస్తే నిజంగా మన పిల్లలకు ఉద్యోగాలు వస్తాయా అనే ప్రశ్న తల్లిదండ్రులలో, యువతలో సహజంగానే వస్తోంది. ముఖ్యంగా ఐటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి రంగాల్లో అవకాశాలు పెరుగుతాయని ప్రచారం జరుగుతోంది.డేటా సెంటర్ అంటే పెద్ద మొత్తంలో సమాచారాన్ని నిల్వ చేయడం, ప్రాసెస్ చేయడం, నిర్వహించడం కోసం ఏర్పాటు చేసే సాంకేతిక వసతి. ఎఐ ఆధారిత కేంద్రం అంటే మెషిన్ లెర్నింగ్ , క్లౌడ్ కంప్యూటింగ్, హై పెర్ఫార్మెన్స్ కంప్యూటింగ్ వంటి ఆధునిక సాంకేతిక సేవలను అందించే స్థలం. ఇలాంటి ప్రాజెక్టు వస్తే నిర్మాణ దశలోనే వేలాది మందికి తాత్కాలిక ఉపాధి లభిస్తుంది. సివిల్ పనులు, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ, లాజిస్టిక్స్ రంగాల్లో స్థానికులకు పని దొరకవచ్చు.అయితే శాశ్వత ఉద్యోగాల విషయంలో వాస్తవ పరిస్థితి కొంచెం భిన్నంగా ఉంటుంది. డేటా సెంటర్లలో పనిచేసే సిబ్బంది ఎక్కువగా టెక్నికల్ నైపుణ్యాలు కలిగినవారే. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్లు, సైబర్ సెక్యూరిటీ నిపుణులు, డేటా సైంటిస్టులు వంటి ప్రత్యేక శిక్షణ పొందినవారికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి. కాబట్టి మన పిల్లలకు ఉద్యోగాలు రావాలంటే సంబంధిత విద్య, నైపుణ్యాలు ఉండాలి. కేవలం ప్రాజెక్టు రావడం మాత్రమే సరిపోదు.ఇంకా ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఇలాంటి భారీ పెట్టుబడులు నగర అభివృద్ధికి దోహదం చేస్తాయి. రోడ్లు, విద్యుత్ సరఫరా, ఇంటర్నెట్ కనెక్టివిటీ వంటి మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయి. దీని వల్ల ఇతర ఐటీ కంపెనీలు కూడా విశాఖపట్నం వైపు ఆకర్షితమయ్యే అవకాశం ఉంది. ఐటీ ఎకోసిస్టమ్ ఏర్పడితే పరోక్షంగా మరిన్ని ఉద్యోగాలు సృష్టించబడతాయి. హోటళ్లు, రవాణా, రెంటల్ హౌసింగ్ వంటి రంగాలు కూడా లాభపడతాయి.అయితే ఈ ప్రాజెక్టు నిజంగా ఎప్పుడు ప్రారంభమవుతుంది

# డయేరియా మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం

శ్రీకాకుళం, శ్రీకాకుళం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న మంగువారితోట రాంనగర్ కు చెందిన మండల సురేష్ డయేరియా కారణంగా మృతి చెందారు. సురేష్ మృతి చెందిన సమాచారం అందిన వెంటనే జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే గొండు శంకర్ సురేష్ కుటుంబాన్ని పరామర్శించి 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంగళవారం రాత్రి అందజేశారు.డయేరియాతో మృతి చెందిన 43 సంవత్సరాల వయసు గల శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సోమవారం చేరి మండల సురేష్ ఆరోగ్యం నిలకడగా ఉందని,సోమవారం రాత్రి 12 గంటలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ వ్యక్తిగతంగా వెళ్లి సురేష్ ను పరీక్షించారన్నారు.

## వక్తల శిక్షణకు తప్పనిసరి హాజరు--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25-నంద్యాల జిల్లా బిజెపి తరఫున వక్తలుగా నియమితులైన 50 మంది నాయకులు మరియు జిల్లా శిక్షణ కన్వీనర్లు తప్పనిసరిగా శిక్షణ కార్యక్రమానికి హాజరుకావాలని నంద్యాల బిజెపి జిల్లా అధ్యక్షులు అభిరుచి మధు స్పష్టం చేశారు.పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల నేపథ్యంలో, జిల్లా వ్యాప్తంగా జరిగే శిక్షణల్లో వక్తలుగా పాల్గొనాల్సిన వారికి ప్రత్యేక సన్నాహక శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణలో ఎలా సిద్ధం కావాలి, ఏ అంశాలపై మాట్లాడాలి వంటి విషయాలపై మార్గదర్శనం అందించనున్నట్లు చెప్పారు.ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు అనంతపురం జిల్లా బిజెపి కార్యాలయంలో కార్యక్రమం ప్రారంభమై సాయంత్రం 5 గంటలకు ముగుస్తుందని తెలిపారు. జిల్లాలోని అన్ని వక్తలు, శిక్షణ కన్వీనర్లు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు.అలాగే జిల్లా శిక్షణ కన్వీనర్లు, కో-కన్వీనర్లు తమకు కేటాయించిన అసెంబ్లీ పరిధిలోని వక్తలకు వెంటనే సమాచారం అందించి, వారిని శిక్షణ సన్నాహక సమావేశానికి హాజరు చేయాలని సూచించారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన---




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25-నంద్యాల పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ చాంద్ భాషా ఆధ్వర్యంలో నూనెపల్లి, బొమ్మలసత్రం ప్రాంతాలు మరియు హైవేలపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని ఆపి రోడ్డు భద్రతా నిబంధనలు వివరించారు. హైవేలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా మానవ తప్పిదాల వల్లనే జరుగుతున్నాయని, అందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరాలని కోరారు.ముఖ్య సూచనలు: హెల్మెట్ ధరించడం తప్పనిసరి, మద్యం సేవించి వాహనం నడపరాదు, త్రిబుల్ రైడింగ్ చేయరాదు, అతివేగం వద్దు, మైనర్లు వాహనాలు నడపరాదు, ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులు లేదా సరుకు ఎక్కించరాదు.

## సోలార్ పనులు వేగవంతం చేయాలి--

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా---

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25:-జిల్లాలో అమలులో ఉన్న సోలార్ విద్యుత్ పథకాల పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఏపీఎస్పీడీసీఎల్ అధికారులు, ఇంజనీర్లు, సోలార్ వెండర్లతో కలిసి పథకాల పురోగతిని ఆమె సమీక్షించారు.పీఎం-కుసుమ్-సి పథకం కింద చేపట్టిన 9 పనుల్లో 4 పనులకు స్థలాలు ఖరారు చేసినట్లు తెలిపారు. మిగిలిన పనులకు భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఖరారైన పనులను తక్షణమే ప్రారంభించాలన్నారు. జిల్లాలో 117 ఎకరాల్లో 29 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు వృద్ధి ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు అవార్డు లేఖ జారీ చేసినట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 13,595 వ్యవసాయ పంప్‌సెట్లకు సౌర విద్యుత్ సరఫరా అందించనున్నట్లు తెలిపారు.పీఎం సూర్యఘర్, రూఫ్‌టాప్ సోలార్ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు కేటాయించిన ప్లాంట్లను త్వరగా పూర్తి చేయాలని వెండర్లకు ఆదేశించారు. ప్రజల్లో అవగాహన పెంచి రిజిస్ట్రేషన్లు పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.సోలార్ ప్రాజెక్టుల సమర్థ అమలుతో రైతులు, గృహ వినియోగదారులు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ పొందగలరని కలెక్టర్ పేర్కొన్నారు.



# నంద్యాలలో గంజాయి రవాణా బట్టబయలు ఇద్దరు అరెస్ట్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25-ఆపరేషన్ వజ్ర ప్రహార్ కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా పోలీసుల దాడుల్లో గంజాయి రవాణా కేసు బట్టబయలైంది. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ పర్యవేక్షణలో ఎస్డీపీఓ ఆధ్వర్యంలో నంద్యాల వన్ టౌన్ పోలీసులు ప్రత్యేక దాడి నిర్వహించారు.24.02.2026 సాయంత్రం నంద్యాల టౌన్ జగజ్జనని నగర్ చెరువుకట్ట ప్రాంతంలోని మల్లెలమ్మ గుడి వెనుక భాగంలో తనిఖీలు చేపట్టగా అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.దాసరి కళ్యాణ్ 22 సం. మనోహర్ 23 సం. వారి వద్ద నుండి సుమారు 2 కిలోల గంజాయి మరియు రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దాసరి కళ్యాణ్ పై గతంలో సారాయి కేసు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు.వీరు అరకు ప్రాంతం నుండి తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి నంద్యాలకు తీసుకొచ్చి 10 గ్రాముల ప్యాకెట్లుగా తయారు చేసి కాలేజీ విద్యార్థులు మరియు అలవాటు పడిన వ్యక్తులకు అధిక ధరలకు విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది.గంజాయి విక్రయాన్ని అడ్డుకుని నిందితులను పట్టుకున్న వన్ టౌన్ సీఐ జి సుధాకర్ రెడ్డి మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.గంజాయి వంటి మాదకద్రవ్యాల వినియోగం, నిల్వ, రవాణా, విక్రయం చట్టవిరుద్ధమని పోలీసులు తెలిపారు. మాదకద్రవ్యాలపై సమాచారం ఉన్న వారు పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థుల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.మాదకద్రవ్య రహిత సమాజం కోసం ప్రజలు పోలీసులతో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



## కమిషనర్‌ను కలవాలంటే చెమటలు--

### ప్రజలకు అందని మున్సిపల్ అధికారి--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25-నంద్యాల పట్టణంలో మున్సిపల్ కమిషనర్‌ను ప్రత్యక్షంగా కలవడం ప్రజలకు కష్టసాధ్యంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమ సమస్యలను వివరించేందుకు కార్యాలయానికి వచ్చే సాధారణ ప్రజలకు సరైన అవకాశం దక్కడం లేదని ఆవేదన వ్యక్తమవుతోంది.పట్టణానికి చెందిన పలువురు ప్రజలు తమ వ్యక్తిగత మరియు ప్రాంతీయ సమస్యలను తెలియజేయాలనే ఉద్దేశంతో మున్సిపల్ కార్యాలయానికి వస్తున్నారు. అయితే కమిషనర్‌ను కలవడానికి అనుమతి కోరితే, "సార్‌కు టైమ్ లేదు", "ఇప్పుడు బిజీగా ఉన్నారు", "తర్వాత రండి" అని అటెండర్లు చెప్పడం సాధారణంగా మారిందని వారు వాపోతున్నారు.దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన వృద్ధులు, మహిళలు, సాధారణ ప్రజలు గంటల తరబడి ఎదురుచూసి చివరకు వెనుదిరగాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యలను వినాల్సిన బాధ్యత ఉన్న అధికారి అందుబాటులో లేకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు అనుకూలం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.ప్రతిరోజు ఒక నిర్దిష్ట సమయాన్ని ప్రజల కోసం కేటాయించి, ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రజలను కలవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ప్రజలకు సులభంగా అందుబాటులో ఉండే విధంగా మున్సిపల్ కార్యాలయంలో స్పష్టమైన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.ప్రజల సమస్యలు విని వెంటనే పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.



## మూడవరోజుకు చేరిన అంగన్వాడీల రిలే నిరాహార దీక్ష...



విభారె న్యూస్ డోన్ మా ప్రతినిధి:-బుధవారం డోన్ పట్టణం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట గల దీక్షా శిబిరంలో సిఐటియు పట్టణ అధ్యక్షుడు బి.మాణిక్యం శెట్టి అధ్యక్షతన కొనసాగిన మూడవ రోజు రిలే నిరాహార దీక్షలలో కూర్చున్న విజయలక్ష్మి నాగలక్ష్మి వరలక్ష్మి ఉమాదేవి అంజలి అనూష లకు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (సిఐటియు) యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు జి.శేభారాణి,నిర్మలమ్మ,సిఐటియు పట్టణ కార్యదర్శి టి.శివరాం,ఉపాధ్యక్షులు నక్కి శ్రీకాంత్,మండల నాయకులు పి.రామాంజనేయులు, అంగన్వాడి వర్కర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు సులోచన,నాగలక్ష్మి సుమలత పూల మాలలు వేసి దీక్షలను ప్రారంభింప చేశారు.ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి ధర్మవరం రంగనాయకులు మునీంద్ర సంఘీభావం తెలిపారు.అనంతరం సిఐటియు జిల్లా అధ్యక్షులు వి.యేసు రత్నం మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం 26000 ఇవ్వాలని,ఆయాలకు 20,000 ఇవ్వాలని, గ్రాట్యుటీ,పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని,ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని,పని భారాలు తగ్గించాలని, లబ్ధిదారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని డిమాండ్ చేశారు.అంగన్వాడీల సమస్యలపై అనేక ఏళ్లుగా పోరాటాలు నిర్వహిస్తున్నా హామీలతో కాలం గడుపుతూ ప్రభుత్వాలు మారిపోతున్నాయి తప్ప వారి సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో అంగన్వాడీలు చేసిన 42 రోజుల సమ్మె సందర్భంగా మళ్లీ మేమే అధికారంలోకి వస్తాము సమస్యలు పరిష్కరిస్తామని చెప్పడం జరిగిందని అయితే సిఐటియు పట్టుబట్టి మినిట్స్ రూపంలో ఆ హామీలను పొందడం జరిగిందని అదే సందర్భంలో ప్రతిపక్ష నేతగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు కూడా అధికారంలోకి వచ్చేది మేమే అని అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల సమస్యలు పరిష్కరిస్తామని వారు కూడా హామీ ఇవ్వడం జరిగిందని అయితే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండు సంవత్సరాల కాలంలో ఆ ఊసే ఎత్తడం లేదని మినిట్స్ రూపంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలకే దిక్కు లేదని హామీలు అమలు చేయాలని అంగన్వాడీలు అనేక రకాలుగా ఆందోళన పోరాటాలు నిర్వహిస్తూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిరాహార దీక్షలు మొదలు పెట్టాక అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర నాయకత్వాలను చర్చలకు పిలిచిన శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి వేతనాలు పెంచాలంటే ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెప్పడం భావ్యం కాదని అంగన్వాడి ఆశ తదితర స్కీమ్ వర్కర్లకు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ తదితర చిరు ఉద్యోగులకు వేతనాలు పెంచాలని అడిగినప్పుడు మాత్రమే ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవన్న విషయం గుర్తుకు రావడం సిగ్గుచేటని ఎమ్మెల్యేలు ఎంపీలకు మాత్రం వేతనాలు లక్షల రూపాయల సదుపాయాలు కల్పించడానికి మాత్రం ప్రభుత్వం వెనుకాడదని ఎందుకంటే ఇది వారి చేతిలో పని అని ఎద్దేవా చేశారు.లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకూడదన్న ఉద్దేశ్యంతో ఒకరోజు టీచర్లు ఒకరోజు ఆయాలు వంతున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తూ అంగన్వాడి సెంటర్ లను కొనసాగిస్తున్నామని అంగన్వాడీల సహనాన్ని ప్రభుత్వం పరీక్షించవద్దని నిరవధిక సమ్మె వరకు పరిస్థితి వస్తే ప్రభుత్వమే బాధ్యత వహించవలసి ఉంటుందని ఇప్పటికైనా చిరు ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరి మారాలని ఇలాగే కొనసాగితే గత ప్రభుత్వానికి పట్టిన గతే ఈ ప్రభుత్వానికి కూడా పట్టడం ఖాయమని హెచ్చరించారు.జిల్లావ్యాప్తంగా ఉన్న అంగన్వాడి వర్కర్లతో రేపు ఎల్లుండి నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం దగ్గర నిరాహార దీక్షలు కొనసాగుతాయని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే మార్చి 2న విజయవాడ అలంకార్ సెంటర్ ధర్నా చౌక్ దగ్గర జరిగే మహా ధర్నాతో అంగన్వాడీల సత్తా చాటుదామని అంగన్వాడీలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రహమద్ బి,గుల్జార్ బి,శ్రీలత,లక్ష్మీస్వరి,సుభద్ర,శోభ, ఆదిలక్ష్మి,సుభాషిని తదితరులు పాల్గొన్నారు.



## 508 మందికి అక్రిడిటేషన్ కార్డులు

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



నంద్యాల, ఫిబ్రవరి 25:-2026-27 సంవత్సరానికి గాను నంద్యాల జిల్లాలోని ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అక్రిడిటేషన్ కార్డులను జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ శ్రీమతి జి. రాజకుమారి. డీఐపీఆర్ఓ మల్లీ ఖార్జునయ్య. కలెక్టర్ ఛాంబర్లో బుధవారం అందజేశారు.జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ తొలి సమావేశంలో ఆమోదం పొందిన మొత్తం 508 మంది పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అక్రిడిటేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న మిగిలిన వారి అర్హతలను పరిశీలించి, తదుపరి కమిటీ సమావేశంలో వారికి కూడా కార్డులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.మొదటి జాబితాలో ఉన్న పాత్రికేయులు సంబంధిత డీఐపీఆర్ఓ కార్యాలయం నుంచి తమ కార్డులను స్వీకరించవచ్చని, ప్రభుత్వం కల్పించిన ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఐపీఆర్ఓ మల్లీ ఖార్జునయ్య మరియు మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మ తల్లి గ్రామ దేవర లో యువ నాయకులు గౌతమ్ రెడ్డి..



విభారే న్యూస్ డోర్ మా ప్రతినిధి :- డోన్ మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో టిడిపి నాయకులు కోనేటి కాశీ విశ్వనాథ్,శేఖరయ్య, బ్రహ్మయ్య, భీమా,శీలప్ప ల ఆహ్వానం మేరకు ఎల్లమ్మ తల్లి గ్రామ దేవర మహోత్సవమునకు హాజరైన తెలుగుదేశం యువ నాయకులు ధర్మవరం మన్నె గౌతమ్ కుమార్ రెడ్డి

## పీఎం రాహత్ పథకం అమలు వేగవంతం--

### జిల్లా కలెక్టర్ జి రాజకుమారి గణియా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25:రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ నగదు రహిత వైద్య సహాయం అందించే పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులకు సూచించారు. బుధవారం సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు.ప్రమాదం జరిగిన తొలి 7 రోజుల్లో ఒక్కొక్కరికి గరిష్టంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత చికిత్స అందుతుందని తెలిపారు. పోలీసుల ధృవీకరణ అనంతరం సాధారణ గాయాల కేసుల్లో 24 గంటలు, తీవ్ర గాయాల కేసుల్లో 48 గంటలు స్థిరీకరణ వైద్య సేవలు కల్పించబడతాయని వివరించారు. ఆసుపత్రులకు చెల్లింపులు మోటారు వాహన ప్రమాద నిధి ద్వారా చేయబడతాయని, బీమా లేని వాహనాల సందర్భంలో ప్రభుత్వం ఖర్చును భరిస్తుందని పేర్కొన్నారు. పథకం గురించి ప్రజల్లో అవగాహన పెంచాలని అధికారులకు ఆదేశించారు.



## జల్సాల కోసం బైక్ చోరీలు-

### ఐదు వాహనాల స్వాధీనం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి ఫిబ్రవరి 25:ఎస్పీ ఉత్తర్వుల మేరకు, నంద్యాల ఏఎస్పీ మార్గదర్శకత్వంలో త్రీ టౌన్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా ఎస్పీవై రెడ్డి డిగ్రీ కాలేజీ సమీపంలోని బొమ్మల సత్రం వద్ద మదర్ వలి అనే వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించాడు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా, జల్సాల కోసం డబ్బులు సరిపోక బైక్‌లను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు.నిందితుడి వద్ద నుంచి మొత్తం ఐదు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో మూడు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధికి, రెండు తాలూకా పరిధికి చెందినవిగా గుర్తించారు. స్వాధీనం చేసిన వాహనాల మొత్తం విలువ సుమారు లక్ష ఎనబై వేలుగా అంచనా వేశారు.నిందితుడిని బుధవారం కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఆదేశాల మేరకు జుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.బైక్ చోరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు ముమ్మరం చేశారు.



EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190